

పాపయ్యయాదవ్‌నగర్‌లో జరిగిన పూజల్లో బీజేపీ నేత భరతసింహారెడ్డి



చెరుకుపల్లికాలనీలో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్



యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద్



సూరారం నార్త్‌సిటీ హైస్కూల్‌లో చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

జై శ్రీకృష్ణ

వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్ని కృష్ణుడి వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. గోపికల మధ్య కోలాటామాడుతూ వేణువు ఊదుతూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. వివిధ పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో చిన్ని కృష్ణులు, గోపికలు నృత్య ప్రదర్శనలు అబ్బురపరిచాయి.

– కుత్బుల్లాపూర్



జగద్గిరిగుట్ట రాజీవ్ గృహకల్పలోని సంస్కృతి స్కూల్‌లో..





చిన్ని కృష్ణులు

ఇది ముమ్మాటికీ నిర్లక్ష్యమే..

- వైరల్ అవుతున్న మ్యాన్‌హోల్ తెరిచిన వీడియోలు
- కాలనీ ప్రెసిడెంట్, వాచ్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఆదేశం
- 174 సెక్షన్ కింద కేసు నమోదు చేశాం: బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ సుమన్
- ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని వెల్లడి



సీసీ ఫుటేజీలో లభ్యమైన మ్యాన్‌హోల్ మూత తెరుస్తున్న దృశ్యాలు



ఎన్‌ఆర్‌ఐ కాలనీ నుంచి తుర్క చెరువు వెళ్లే ఓపెన్ నాలా

నిజాంపేట్: చేతులు కాలాకా ఆకులు పట్టుకున్న చందంగా ఉంది నిజాంపేట్ కార్పొరేషన్ అధికారుల పనితీరు. మంగళవారం ప్రగతినగర్‌లోని ఎన్‌ఆర్‌ఐ కాలనీలో మ్యాన్‌హోల్‌లో జారిపడి నాలాలో కొట్టుకుపోయి బాలుడు మిథున్‌రెడ్డి (4) మృతి చెందిన ఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ అధికారులు ఆగమేఘాల మీద సమీపంలో మ్యాన్‌హోళ్ల మూతలను సరిచేయడంతో పాటు బాలుడు జారిపడిన అపార్ట్‌మెంట్ సమీపంలోని నాలాను ఆనుకుని కంచెను ఏర్పాటు చేశారు. అయితే ప్రగతినగర్ ఎన్‌ఆర్‌ఐ కాలనీ నుంచి నిజాంపేట్‌లోని తుర్క చెరువు వరకు ఉన్న నాలా ప్రమాదకరంగా ఉంది. ఎటువంటి రక్షణ కంచె లేకపోవడంతో పాటు పలు చోట్ల నాలాపై శ్లాబ్‌లు లేకపోవడం.. ఓపెన్ నాలాగా ఉండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ముందే నాలా ప్రాంతాల్లో రక్షణ ఏర్పాట్లతో పాటు మ్యాన్‌హోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉన్నట్లయితే బాలుడి ప్రాణాలు పోయేవి కాదని పలువురు పెదవి విరుస్తున్నారు.

చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రగతినగర్ స్పాటిలా గార్డెనియా అపార్ట్‌మెంట్ సమీపంలో వరదనీరు వెళ్లేందుకు మ్యాన్‌హోల్ మూత తెరుస్తున్న వీడియోలు వైరల్‌గా మారాయి. వాట్సాప్ గ్రూప్‌లు, ఫేస్‌బుక్‌లో ఈ వీడియోలు అప్‌లోడ్ కావడంతో సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మ్యాన్‌హోల్ పైకప్పు తెరిచిన వారిపై కేసు..

ప్రగతినగర్‌లోని స్పాటిలా గార్డెనియా అపార్ట్‌మెంట్ వద్ద మ్యాన్‌హోల్ మూత తెరిచి బాలుడు మృతికి కారణమైన కాలనీ ప్రెసిడెంట్, వాచ్‌మెన్‌లపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. 174 సెక్షన్ కింద కేసు నమోదు చేశామని, సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ సుమన్ కుమార్ తెలిపారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



ఎమ్మెల్సీ శంబీపూర్ రాజును కలిసి విజయనగర్‌కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

రంగారెడ్డినగర్: సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీ నూతన సంక్షేమ సంఘం సభ్యులు మాజీ మున్సిపల్ చైర్మన్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో శంబీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంఘానికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ... కాలనీలో ప్రజలతో మమేకమై స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. స్థానికంగా అభివృద్ధి విషయంలో తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, చిలుక సతీష్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు రియాజ్, ప్రధాన కార్యదర్శి మల్లం శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు బాలునేత, వర్కింగ్ ప్రెసిడెంట్ బొప్పని బాలరాజ్, కోశాధికారి నర్సింహాగౌడ్, మహేష్, మదన్ గౌడ్, రాము, అల్తాఫ్, దేవేందర్ రెడ్డి, ప్రకాష్, పాల్గొన్నారు.

అభినందనలు



తరుణ్ సాయిని అభినందిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

దుండిగల్: మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థి కరాటేలో ప్రతిభ కనబర్చాడు. ఐటీ మూడో సంవత్సరం చదువుతున్న తరుణ్ సాయి ఇటీవల నిర్వహించిన కరాటే పోటీల్లో సీఎం కేసీఆర్ గోల్డ్ మెడల్‌ను సాధించాడు. తరుణ్ సాయిని కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతో పాటు క్రీడలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ప్రతి ఏడాది విద్యార్థులకు రూ.1.50 కోట్ల స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవు



సర్వే నం.342లో వెలసిన గదులను కూల్చివేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ హెచ్చరించారు. గాజులరామారం డివిజన్‌లోని కైసర్ నగర్ సర్వే నం.342లోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన 3గదులను గురువారం తహసీల్దార్ రెహమాన్ ఖాన్ ఆదేశాల మేరకు జేసీబీతో కూల్చి వేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్న వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



వరద పారుతూనే ఉంది...

గాజులరామారం డివిజన్ ఓక్షిత్ ఎన్‌క్లేవ్ మూడు రోజులుగా జలవిలయంలో చిక్కుకుంది. ఇక్కడ అధికారులు సహాయక చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారు. కనీసం బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - సుభాష్‌నగర్

భారత్ జోడో విజయోత్సవ ర్యాలీ



గాజులరామారంలో భారత్ జోడో యాత్ర విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న హన్మంతరెడ్డి

సుభాష్‌నగర్: కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు శ్రీకారం చుట్టి ఏడాది పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి నేతృత్వంలో గురువారం గాజులరామారం అంబేడ్కర్ విగ్రహం వద్ద విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. మొదటి విడత జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. రెండో విడత యాత్ర గుజరాత్ నుంచి మేఘాలయ వరకు 4వేల కిలోమీటర్ల మేర రాహుల్ యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అవిజె జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్ రెడ్డి, టేకుల ప్రవీణ్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కొలన్ జీవన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గణేష్, రాజశేఖర్, వేణు, మొండి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గృహకల్ప అటవీ ప్రాంతంలో గస్తీ పెంచాలి

సుభాష్‌నగర్: సూరారం కాలనీ రాజీవ్‌గృహకల్పను ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతంలో కొంతమంది యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని గృహకల్ప ప్రెసిడెంట్ శివ కుమార్‌గౌడ్ ఆరోపించారు. స్థానికంగా పోలీస్ గస్తీ పెంచాలని గురువారం సూరారం సీఐ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ గృహకల్ప 28వ బ్లాక్ నుంచి 48వ బ్లాక్ వరకు పక్కనే అటవీ ప్రాంతం ఉందన్నారు. అక్కడ యువకులు గంజాయి, పేకాట, మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాల పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారని దీంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు నిఘా ఉంచి ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.



వరద ప్రవాహం.. జారి పడే ప్రమాదం

సుభాష్‌నగర్: రోజుల తరబడి రహదారులపై ప్రవహిస్తున్న వరదనీటితో ఆ ప్రాంతంలో రోడ్లు దెబ్బతిని రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గాజులరామారం డివిజన్ రావినారాయణరెడ్డినగర్‌లో వరదనీరు వెళ్లేందుకు అధికారులు కాలువలు తెరిచారు. రోజుల తరబడి రోడ్లపైకి నీరు ప్రవహించడంతో అటుగా వెళ్తున్న వారు జారి పడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదం జరుగకముందే అధికారులు కళ్లు తెరిచి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చాక్లెట్ దొంగలించాడని బాలుడిపై ఆగ్రహం

ప్రశ్నించిన తండ్రిని చితకబాదిన బేకరీ సిబ్బంది



మా నాన్నను కొట్టవద్దంటూ ప్రాధేయపడతున్న చిన్నారి

జీడిమెట్ల: అసలు ఏం జరిగిందో తెలియదు.. ఓ వ్యక్తిని పట్టుకుని ముగ్గురు వ్యక్తులు కొట్టడం మొదలు పెట్టారు. రోడ్డుపై వెళ్తున్న వారు అసలు సదరు వ్యక్తిని ఎందుకు కొడుతున్నారో అర్థంగాక చూస్తూ ఉండిపోయారు. దెబ్బలు తింటున్న వ్యక్తి కూతురు మా నాన్నను కొట్టవద్దంటూ ఏడుస్తున్నా తండ్రిని చితకబాదారు. కూతురు, కొడుకుని తీసుకొని ఓ వ్యక్తి జీడిమెట్ల పీఎస్ పరిధిలోని తిరుమల బేకరిలో వెళ్లాడు. ఈ క్రమంలో సదరు వ్యక్తి కొడుకు చాక్లెట్ దొంగిలించాడని బేకరీ యజమాని ఆ బాలుడిని తిట్టడం ప్రారంభించాడు. ఇది గమనించిన ఆ బాలుడి తండ్రి ఎందుకు తిడుతున్నావంటూ ప్రశ్నించాడు. చిన్న పిల్లాడు చాక్లెట్ తీసుకుంటే ఇలా అంటారా అని అనడంతో కోపోద్రిక్తుడైన బేకరీ యజమాని అతడిపై దాడి చేశాడు. ఈ విషయంపై పోలీసులను వివరణ అడగగా సీఐ పవన్ తనకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. సదరు వ్యక్తి సైతం తనపై దాడి చేసిన వారిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకుండానే వెళ్లిపోయినట్లు తెలుస్తోంది.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

మరొకరికి గాయాలు



మృతుడు చంద్రశేఖర్

జగద్గిరిగుట్ట: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందగా.. మరో వ్యక్తి గాయాలపాలైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షిరిడీ హిల్స్‌లో ఉంటున్న శానమ్మ, నర్సింహాకు ఒకే కుమారుడు చంద్రశేఖర్ (20). నర్సింహా కొద్ది కాలం క్రితం చనిపోవడంతో శానమ్మ తన కుమారుడు చందుతో ఉంటోంది. కాగా గురువారం రాజీవ్ గృహకల్పలోని 47వ బ్లాక్ రెండో అంతస్తులో బంధువుల ఇంట్లో ప్లంబింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్లంబర్‌కు ఈ పనులు చేయడానికి నిచ్చెన అవసరం పడగా చంద్రశేఖర్ తన బంధువైన శ్రీకాంత్‌తో కలిసి ఇనుప నిచ్చెనను ఏర్పాటు చేశారు. కాగా ఈ నిచ్చెనను రెండో అంతస్తుకు తరలిస్తున్న సమయంలో రాజీవ్ గృహకల్పకు సరఫరా అయ్యే మెయిన్ లైన్ వైర్లపై నిచ్చెన పడింది. దీంతో విద్యుత్ ప్రసరించి చంద్రశేఖర్, శ్రీకాంత్ అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. దీంతో వారి ఇద్దరిని కూకట్‌పల్లిలోని రాందేవ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చంద్రశేఖర్ మృతిచెందాడు. శ్రీకాంత్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోస్టాఫీస్ తరలింపును ఉపసంహరించుకోవాలి

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ఎన్టీఆర్ పార్కు సమీపంలో ఉన్న పోస్టాఫీస్ తరలింపును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి వెంకటరామయ్య అన్నారు. ఈనెల 7న ప్రగతినగర్‌లోని పోస్టాఫీస్‌ను బాచుపల్లికి మార్చనున్నారు. ఈ సందర్భంగా వెంకటరామయ్య మాట్లాడుతూ.. ప్రగతినగర్‌లో సుమారు లక్ష వరకు జనాభా ఉందన్నారు. వివిధ రకాల సేవలను పొందుతూ వస్తున్న ప్రజలకు దూరంగా పోస్టాఫీస్‌ను మార్చడం సరైన నిర్ణయం కాదన్నారు. సీనియర్ సిటిజన్లతో పాటు మహిళలు, పింఛన్‌దారులకు పోస్టాఫీసు సేవలు అందుతున్నాయని తెలిపారు. పోస్టాఫీస్ తరలింపు ప్రక్రియను నిలిపివేయాలని కోరారు.